కూకట్‌పల్లి టికెట్ బీజేపీ నేతకే ఇవ్వాలి

కూకట్‌పల్లి పార్టీ కార్యాలయం వద్ద మౌనదీక్ష

కూకట్‌పల్లి: తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బీజేపీ జనసేన పార్టీతో పొత్తు పెట్టుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కూకట్‌పల్లి సెగ్మెంట్‌కు సంబంధించిన టికెట్ ఖచ్చితంగా బీజేపీ పార్టీకే ఇవ్వాలని అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం ఎదుట శుక్రవారం నాయకులు మౌనదీక్ష చేపట్టారు. ఈ దీక్షలో బీజేపీ నేత మాధవరం కాంతారావు పాల్గొని మాట్లాడారు.

- తెలంగాణ రాష్ట్రంలో నామినేషన్ ప్రక్రియ మొదలైనందున కూకట్‌పల్లి అసెంబ్లీ స్థానానికి సంబంధించిన టికెట్ విషయంలో జాప్యం చేయటం బీజేపీ అధిష్టానం మొండి వైఖరిని తెలియజేస్తోందన్నారు. ఇప్పటికే బీజేపీ మిత్ర పక్షమైన జనసేన పార్టీకే కూకట్‌పల్లి అసెంబ్లీ టికెట్ అంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో వాటిని ఎప్పటికప్పుడు ఖండిస్తున్నామని తెలిపారు. కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ సీనియర్ నాయకులందరం మూకుమ్మడిగా రాజీనామ చేశామని తెలిపారు.
- ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర బీజేపీ నాయకత్వం టికెట్ విషయంలో పునరాలోచించాలన్నారు. స్థానిక బీఆర్‌యస్‌పార్టీ అరాచకాలు, ఆక్రమణలు ప్రశ్నించే బీజేపీ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు, నియంతృత్వ విధానాలను అంతమొందించేందుకు బీజేపీ పార్టీ అభ్యర్థికే అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకలు సూర్యప్రకాష్, సూర్యరావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, శ్రీకర్ రావు, షేక్ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావం తెలిపిన మురళీధర్‌రావు...

కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వద్ద మౌన దీక్ష చేస్తున్న బీజేపీ నాయకులను శుక్రవారం మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ కూకట్‌పల్లి టికెట్‌ను బీజేపీ పార్టీకే కేటాయించాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్‌జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మౌనదీక్ష చేస్తున్న మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు



నాయకులకు సంఘీభావం తెలుపుతున్న మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు

నామినేషన్.. డైవర్షన్



సామాన్యులకు నో పర్మిషన్



కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం వద్ద నామినేషన్ నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు. నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులు, నాయకులకు తప్ప సామాన్యులను అనుమతించ లేదు. దీంతో పోలీసులు వాహనాలను మళ్లించారు. చేసేది లేక వేరే మార్గం గుండా వారి గమ్యస్థానాలకు వాహనదారులు వెళ్లారు.

ఆ గొట్టిముక్కల ఔట్.. ఈ గొట్టిముక్కల ఇన్!

గొట్టిముక్కల వెంకటేశ్వరరావుకు కాంగ్రెస్ పార్టీ ఆహ్వానం



కాంగ్రెస్ నేత మల్లు రవితో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడ్డ పార్టీ సీనియర్ నాయకుడు, మలిదశ ఉద్యమకారుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావును టీపీసీసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మల్లు రవి ఆయన నివాసంలో కలిసి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా పోటీలో ఉంటున్నట్లు ప్రకటించి తన మద్దతుదారులు, నాయకులు, అభిమానులతో కలిసి నామినేషన్‌కు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ తరుణంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆయనను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. దీంతో కూకట్‌పల్లిలో రాజకీయాలు రసవత్తరంగా మారే అవకాశం ఉంది. కూకట్‌పల్లిలో చాలా కాలం నుంచి పనిచేస్తున్న గొట్టిముక్కల వెంకటేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరితే పార్టీకి బలం పెరుగుతుందని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు. ఇప్పటికే గొట్టిముక్కల వెంగళరావు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వెంగళరావు స్థానాన్ని వెంకటేశ్వరరావుతో భర్తీ చేస్తున్నట్లుగా కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్యే గాంధీకి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలి

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీకి మద్దతుగా ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శుక్రవారం ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని ధరణినగర్, జీఎస్ఆర్ నగర్ కాలనీలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు వెళతున్నామన్నారు. అందరం సమష్టిగా పనిచేసి ఎమ్మెల్యే గాంధీకి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం



సమస్యల పరిష్కరించిన అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వినియోగదారుల సదస్సులో కూకట్‌పల్లి డీఈ దాసరి చక్రవర్తి, ఏడీఈ శంకరయ్య, ఏడీఈలు హరికృష్ణ, బి.ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను సంబంధిత అధికారులకు పరిష్కరించాలని సూచించారు.



వినియోగదారుల సదస్సులో డీఈ చక్రవర్తి

కొండాపూర్‌లో..

విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని కొండాపూర్ డివిజన్ పరిధిలో నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం 8 మంది సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని డీఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీజీఎం రంగారెడ్డి జోన్ ఆనంద్, ఎస్ఈ సైబర్ సిటీ సర్కిల్ వెంకన్న తదితరులు పాల్గొని సమస్యలను పరిష్కరించారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను వందశాతం అమలు చేస్తాం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలాజీనగర్ డివిజన్ వివేక్‌నగర్‌లో డివిజన్ అధ్యక్షుడు కృష్ణా రాజ్‌పుత్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారం కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రతి ఓటరుకు అండగా ఉంటానన్నారు.ఇక్కడ ఉన్నటువంటి అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అమలుకు సాధ్యం కాని హామీల పేరుతో ప్రజలను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ, మహిళా నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బండి రమేష్ గెలుపే లక్ష్యంగా ప్రచారం..

ఓల్డ్ బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్ గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం సాగిస్తున్నారు. శుక్రవారం హస్మత్‌పేట అంజయ్యనగర్ ప్రాంతాలలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్ ఆధ్వర్యంలో టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి మహిళలు, నాయకులు, కార్యకర్తలు ప్రచారం సాగిస్తున్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచుతూ చేయ్యి గుర్తుకు ఓటు వేసి బండి రమేష్‌ను గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడితే తెలంగాణ ప్రజల కష్టలు అన్ని పోతాయని ఈ సందర్భంగా దండుగుల యాదగిరి తెలిపారు. ప్రజలను మభ్య పెట్టి మోసం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీని ఓడించి కాంగ్రెస్ సత్తా చాటుతుందని దీమా వ్యక్తం చేశారు. విజయలక్ష్మి, జ్యోతి, దండుగుల సందీప్, పి. అంజి, ఆనంద్, షాయిన్‌షా, కిరణ్‌గౌడ్, శ్రీను, శ్రీకాంత్, శ్రీరాములు, అమ్జద్, గౌస్ పాల్గొన్నారు.



బాలాజీనగర్ డివిజన్ వివేక్‌నగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్



అంజయ్యనగర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మూడోసారి అధికారం బీఆర్ఎస్‌దే..

కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు



బీఆర్ఎస్‌లో చేరిన వారితో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు శుక్రవారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలకు ప్రతి ఒక్కరూ ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ఫసి ఉద్దీన్, జహంగీర్, ఇనాయత్, వజీర్‌మియా, షేక్ యూసుఫ్, రాఫ్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

కాంగ్రెస్‌కు మద్దతు తెలపటం ఆహ్వానిస్తున్నాం

వైఎస్ఆర్‌టీపీ నేత నేతి శ్యాంసుందర్



కూకట్‌పల్లి: తెలంగాణలో పోటీ చేయకూడదని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల నిర్ణయం తీసుకోవటం ఆహ్వానించదగిన విషయమని పార్టీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ నేతి శ్యాంసుందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఉద్దేశంతో షర్మిల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకే తన మద్దతు ఉంటుందని ప్రకటించటాన్ని ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎన్ని జన్మలెత్తినా మీ రుణం తీర్చుకోలేను

కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లో జరిగిన ప్రచారంలో అడుగడుగునా జన నీరాజనం
- బతుకమ్మ, బోనాలతో స్వాగతం పలికిన మహిళలు
- కారు గుర్తుకే ఓటేస్తామంటున్న కాలనీ అసోసియేషన్ల తీర్మానం



ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మాధవరం కృష్ణారావు



మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న మాధవరం కృష్ణారావు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రచారం విజయోత్సవ ర్యాలీని తలపించింది. అడుగడుగున మహిళలు నీరాజనాలు పలికారు. బతుకమ్మలు, బోనాలతో స్వాగతం పలకడంతో పండగ వాతావరణ నెలకొంది. ప్రజలు పూల వర్షం కురిపించి తమ అభిమానం చాటుకోవడంతో ప్రజల ఆదరాభిమానాలకు చలించిపోయిన మాధవరం కృష్ణారావు 'ఎన్ని జన్మలు ఎత్తిన మీ రుణం తీర్చుకోలేను'అని చేతులెత్తి మొక్కారు. శుక్రవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలసి మాధవరం కృష్ణారావు సుడిగాలి ప్రచారం నిర్వహించారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయాలి

శంకర్ ఎన్‌క్లేవ్‌లో 25 కాలనీల అసోషియేషన్ల ప్రతినిధులు సమావేశం ఏర్పాటు చేయడంతో ఆయన అందులో పాల్గొని మాట్లాడారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటే ఎన్నో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కారించి కోట్లాది రూపాయల అభివృద్ధి చేసిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. అభివృద్ధిని చూసి ఓటు వేయాలన్నారు. దీనికి స్పందించి కాలనీల అసోసియెషన్ ప్రతినిధులు వార్వారి కాలనీలలో జరిగిన అభివృద్ధిని వివరించారు.

కృష్ణారావును మంత్రిగా చూడాలని ఉంది..

తమకు అండగా ఉన్న మాధవరం కృష్ణారావును గ్రేటర్ హైదరాబాద్‌లో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపిస్తామన్నారు. ఆయనను మంత్రిగా చూడాలని ఉందని.. ఆయన మంత్రి అయితే రాష్ట్రంలో మరింత అభివృద్ధి చేస్తారన్నారు. అందుకే తామంతా కారు గుర్తుకే ఓటు వేయాలని ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నామని ప్రకటించారు.

పజాభిమానానికి నోట మాట రావడం లేదు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా పార్టీలకు అతీతంగా వారికి పని చేశానన్నారు. ఇంటికి పెద్ద కొడుకుగా ఉంటూ పని చేస్తున్నానని పేర్కొన్నారు. తనపై మహిళలు చూపిస్తున్న అభిమానానికి నోట మాట రావడం లేదన్నారు. ఇంత మంది హృదయాలను గెలుచుకున్న తన జీవితం ప్రజాసేవకే అంకితమన్నారు. అభివృద్ధి చేయడానికి ఎన్ని అడ్డంకులు వచ్చినా తట్టుకుని అభివృద్ధికి బాటలు వేశానన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన విష్ణువర్ధన్‌రెడ్డి



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును శుక్రవారం జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఆయన గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనకు మద్దతు ప్రకటించినందుకు ఎమ్మెల్యే కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. అందరం కలిసి పనిచేసి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్దామన్నారు.



బాలాజీనగర్ డివిజన్ మహిళలతో సమావేశం

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్ మహిళలతో శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమావేశమయ్యారు. మహిళలు, చిన్నారులకు ప్రత్యేకంగా పార్కులు, 24గంటల విద్యుత్, మంచినీరు వంటి అనేక మౌలిక సదుపాయాలు కల్పించినందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తమ పూర్తి మద్దతు కృష్ణారావుకే ఉంటుందని తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరిన యువత

కూకట్‌పల్లి: నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై మూసాపేటకు చెందిన యువకులు ప్రదీప్‌యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ప్రదీప్‌యాదవ్ మాట్లాడుతూ... కృష్ణారావు లాంటి నాయకుడు భవిష్యత్ తరాలకు కావాలన్నారు. ఆయన విధానాలు నచ్చి బీఆర్ఎస్‌లో చేరామని తెలిపారు.



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన పలువురు యువకులు

ఏ సమస్య వచ్చినా కార్మికులకు అండగా ఉంటాం

కార్మిక నాయకుడు రవిసింగ్



మూసాపేట: భరత్‌నగర్ ప్రాంతంలో రామకృష్ణ అనే బిల్డర్ వద్ద భవనం మెటీరియల్ కోసం సత్యనారాయణ అనే కార్మికుడు కాంట్రాక్టు తీసుకున్నాడు. పని పూర్తి అయిన తర్వాత బిల్డర్ కార్మికుడికి డబ్బులు చెల్లించలేదు. దీంతో పలుమార్లు కార్మికుడు బిల్డర్‌ను డబ్బులు అడిగి విసుగు చెంది బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు రవిసింగ్ గురించి తెలుసుకొని ఆయన కార్యాలయంలో సంప్రదించాడు. విషయం తెలుసుకున్న రవిసింగ్ బిల్డర్‌తో పలుమార్లు చర్చించి కార్మికుడికి రావాల్సిన రూ.45వేలను ఇప్పించారు. ఈ సందర్భంగా కార్మికుడు రవిసింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌చారి, మనోజ్‌కుమార్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

బాలానగర్: తండ్రి మందలించటంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇళ్లు వదలి వెళ్లిన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజు కాలనీలో రాజు గౌడ్ తన కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. అతని పెద్ద కుమారుడు పవన్ (26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అయితే ఇటీవల కాలంలో పవన్ ఎక్కువగా అప్పులు చేశాడు. దాంతో తండ్రి పవన్‌ను అప్పులు ఎందుకు ఎక్కువ చేస్తున్నావనే విషయంలో మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన పవన్ ఇంటి నుంచి శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో బయటకు వెళ్లాడు. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. సోదరుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

18న బహిరంగ వేలం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి గ్రామంలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో కొబ్బరికాయలు, పూలు, పూజాసామగ్రి అమ్ముకునేందుకు ఈనెల 18వ తేదీన ఉదయం 10.30గంటలకు బహిరంగ వేలం ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఓ ప్రకటనలో తెలిపారు. పాత శివాలయంలో కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు కోసం నవంబర్ 19, 2023 నుంచి నవంబర్ 18, 2024 వరకు కొబ్బరి కాయలు, పూలు, పూల సామాన్లు అమ్ముకునేందుకు గాను 20వేల రూపాయలు ధరావత్తు చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

గోపాల్‌నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాం

కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు శుక్రవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా గోపాల్‌నగర్‌లో ప్రతి ఇంటికి వెళ్లి ఈ పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు కారు గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో గోపాల్‌నగర్‌లో రోడ్లు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించుకున్నామని తెలిపారు. అదే విధంగా పార్కులు, ఇండోర్ స్టేడియాలు, మంచినీరు, 24 గంటల విద్యుత్ సహా శాంతి భద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ప్రశాంతంగా జీవిస్తున్నామన్నారు. వీటిని గమనించి మళ్లీ అభివృద్ధికే పట్టం కట్టాలని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కేపీహెచ్‌బీ డివిజన్ నుంచి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు అత్యధిక మెజార్టీ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి,సాయిబాబా చౌదరి,అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, సురేష్ రెడ్డి, రాజేష్, సాయి శ్రీనివాస్, కట్టా నరసింగరావు, గోపాల్‌నగర్ అసోసియేషన్ సభ్యులు, నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

పూరి వేస్తూ.. ఓటేయాలని అభ్యర్థిస్తూ..



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ హోటల్‌లో పూరి వేస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: డివిజన్ పరిధిలోని కూకట్‌పల్లి గ్రామంలో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసుదేవరావు, డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి విద్యాకల్పన, ఏకాంత్‌గౌడ్



టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన విద్యాకల్పన, ఏకాంత్ గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్ బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ విద్యాకల్పన శుక్రవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, శేరిలింగంపల్లి అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరితో పాటు బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు ఏకాంత్‌గౌడ్, ఆల్వాల్ భాస్కర్, బీజేపీ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఎస్సీ మోర్చా సెక్రటరీ అశోక్, జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు గణేష్‌గౌడ్, ఎస్సీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు రమేష్, డివిజన్ బీజేపీ సెక్రటరీ దయాకర్‌రెడ్డి, జితేందర్, డివిజన్ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు బొట్టు శ్రీను, మర్ల శ్రీను, డివిజన్ సోషల్ మీడియా కన్వీనర్ వినోద్, బీజేపీ నాయకులు రణదీర్‌రెడ్డి, పుష్పేందర్, శేఖర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, మహిళా మోర్చా ఉపాధ్యక్షుడు శృతిగౌడ్, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అక్రమ మద్యం, గంజాయి విక్రేతలపై కేసు

బాలానగర్: బాలానగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం, గంజాయి విక్రయిస్తున్న పలువురిపై కేసులు నమోదు చేసినట్లు బాలానగర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సీఐ వేణుకుమార్ తెలిపారు. కల్తీ మద్యాన్ని గుర్తించేందుకు వెరిట్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని మద్యం సీసా మూతపై మద్యం వివరాలు తెలుస్తాయని అన్నారు. ప్రజలు అక్రమ మద్యం గురించి సమాచారం తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నం.1800 4252523కు సమాచారం ఇవ్వాలని కోరారు. వెంటనే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.